## 64. గీత దాటక

మీరు వాహనం డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నప్పుడు, రోడ్డు మధ్యగల తన సరిహద్దు గీతని దాటి అవతలివైపు నించి వచ్చే వాహనం మీ దారిలో వస్తే ఏమవుతుందో తెలుసా?

అందరు డ్రైవర్లూ ఇలా రారు. ఆల్కహాల్ మత్తు, అలసట, నిద్ర రావడం, తుమ్మడం లాంటి వాటివల్ల, ఎదుటి నించి వచ్చే వాహనం అకస్మాత్తుగా మన వాహనానికి అడ్డు వచ్చి ప్రమాదం కలిగించవచ్చు.

'నువ్వు గీతకి అటుంటే, నేను గీతకి ఇటుంటా' అన్న నియమాన్ని పాటిస్తే ఎవరికీ ఏంకాదు. మనం నిత్య జీవితంలో కూడా ఈ ఆదర్శాన్ని అన్నిట్లోనూ పాటిస్తే గొడవే వుండదు.

ఇతరుల గురించిన వదంతులు, చెడు మాటలు మాట్లాడటం ఈ గీత దాటడం లాంటివే. ఎప్పటికైనా వాటి ఫలితం మనం పొందక మానం.

దీన్నే కర్మ సిద్ధాంతం అని, 'ఇతరులకి నువ్వేం చేస్తే దాన్ని నువ్వు తిరిగి పొందుతావు.' అని మన సనాతన ధర్మం చెప్తోంది.

## 65. పునర్జన్మ

ఓ ఆధ్యాత్మిక గురువు తమ ఊరు వచ్చాడని తెలిసి ఒకతను ఆయన దర్శనానికి వెళ్ళాడు.

"అయ్యా! నాదో సందేహం. పునర్జన్మలు ఉన్నాయా? లేవా?" ప్రశ్నించాడతను.

"ఉన్నాయి." గురువు జవాబు చెప్పాడు.

"ఉంటే మరి నా గత జన్మ నాకు గుర్తులేదే?" ప్రశ్నించాడు అతను.

"నువ్వు పుట్టాక మొదటిసారి కళ్ళు తెరిచి ఏదో ఒకటి చూసావు కదా. అదేమిటో చెప్పు." ఠక్కున అడిగాడు గురువు.